RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 21 | పేజీలు : 4 | శనివారం 25 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## నకిలీ వెబ్‌సైట్లు చూసి మోసపోవద్దు

- విమాన ప్రయాణికులకు కేంద్రం హెచ్చరిక
- ఎయిర్ సువిధ 2.0 పేరుతో నకిలీ వెబ్‌సైట్లు మోసాలకు పాల్పడుతున్నాయన్న కేంద్రం
- ఈ సేవలు పూర్తిగా ఉచితమని, ఎలాంటి రుసుము చెల్లించొద్దని ప్రభుత్వం స్పష్టీకరణ
- వ్యక్తిగత వివరాలు ఇచ్చే ముందు వెబ్‌సైట్ ఖ=ానను సరిచూసుకోవాలని సూచన
- ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో ప్రయాణికుల ఆరోగ్య పర్యవేక్షణకు ఈ పోర్టల్ ఏర్పాటు
- వివిధ ఏజెన్సీలతో రియల్ టైమ్ డేటా షేరింగ్ కోసం ఆధునిక వ్యవస్థ

## డిమాండ్లను అంగీకరించిన కేంద్రం

నిరసన విరమించిన క్రాకోచ్ జనతా పార్టీ

ప్రధాన డిమాండ్లకు కేంద్రం అంగీకరించడంతో నిరసన విరమించిన సీజేపీ

నీట్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రభుత్వం హామీ

36 రోజుల పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కొనసాగిన ఆందోళన

కేంద్ర మంత్రులు, సీజేపీ నేతల సంయుక్త మీడియా సమావేశంలో ప్రకటన



# ఆగస్టు నుంచి సంజీవని



సద్వినియోగం చేసుకోండి

ఆగస్టు నుంచి ఏపీలో సంజీవని ఆరోగ్య పథకం అమలు

ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్

వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ

గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శ

పరదాలు కట్టకుండా ప్రజల మధ్యకు వస్తున్నానన్న చంద్రబాబు

**అమరావతి**

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'సంజీవని' పథకాన్ని ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "మీ ఆరోగ్యం.. మీ బాధ్యత" అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. విద్య, వైద్యంపైనే ప్రతి కుటుంబం అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా 'సంజీవని'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు. కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ-ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు.



## అంచనాలకు ఓకే ... పనులు చూశాకే బిల్లులు

'పాలమూరు-రంగారెడ్డి'లో న్యూ రూల్స్?

పాలమూరు - రంగారెడ్డిలో కొత్త నిబంధనలు

ఆదేశాలు జారీ చేసిన ప్రధాన కార్యదర్శి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లోని 4 ప్యాకేజీలకు సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం లభించినా బిల్లులు పాస్ చేసే ముందు పనికి సంబంధించిన వివరాలను నిర్ధారించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. థర్డ్ పార్టీతో పరిశీలింపజేసి, హై పవర్ కమిటీ ఆమోదం తర్వాత గుత్తేదారుకు చెల్లించాలని ఆదేశించింది. ప్రతి పనిని గుత్తేదారు చేశారా? లేదా నిర్ధారించుకోవడం, జాప్యానికి కారణం గుత్తేదారుది కాదు అని రూఢీ చేసుకోవడం సహా పలు నిబంధనలతో తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నీటి పారుదల శాఖ కార్యదర్శికి అంతర్గత మెమో పంపారు. రెండు రోజుల క్రితం పంపిన ఈ మెమో నీటి పారుదల శాఖలో సంచలనం సృష్టించింది.

## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుదేలైందనే

# ప్రచారంలో నిజం లేదు



- ఉద్దేశపూర్వకంగా కొందరు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్న పొంగులేటి
- కాంగ్రెస్ పాలనలో 20 శాతం వరకు రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందిందని వెల్లడి
- హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నామన్న మంత్రి
- గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పుంజుకుంది

**హైదరాబాద్**

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందంటూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న స్పష్టమైన గణాంకాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. గత రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని, ప్లాట్ల విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు పెరిగాయని వెల్లడించారు. గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పుంజుకుందని తెలిపారు. 2004-2014 మధ్య నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సెక్టార్ అభివృద్ధితో హైదరాబాద్ రోల్ మోడల్‌గా మారి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని మంత్రి గుర్తుచేశారు. ఇటీవలి దావోస్ పర్యటనలో కూడా పలువురు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు నగరంలో పెట్టుబడులకు ఆసక్తి చూపారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.7 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టును చేపడుతున్నామని... తొలి విడత 28 కిలోమీటర్ల పరిధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు.



రాహుల్ పోరాటం, విద్యార్థుల ఐక్యత వల్ల

## కేంద్రం దిగివచ్చింది

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, ఉద్యమకారుల విజయమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇది అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపని ఆయన అభివర్ణించారు. రాహుల్ గాంధీ పోరాటం, దేశవ్యాప్తంగా విద్యార్థులు చూపిన ఐక్యత వల్ల కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దనే బలమైన గుణపాఠం కేంద్రానికి దక్కిందని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పతనానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే మొదటి మెట్టు అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, మెట్రో సేవలు బంద్ చేసి, లాఠీ ఛార్జీలు జరిపినా వెరవకుండా వేలాది మంది విద్యార్థులు ధర్నాలో పాల్గొనడం కేంద్రంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. ఉద్యమించి విజయం సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజావ్యతిరేక విధానాలపై ఇదే రీతిలో ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

శనివారం 25 జూలై 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## పచ్చదనంకై ప్రతి ఒక్కరూ పాటు పడదాం..!!

.....పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

......జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

....వెంకటగారిపల్లిలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్

**పుట్టపర్తి జూలై 25:సీమ వార్త**





శనివారం పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లి గ్రామంలో నిర్వహించిన భారీ మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఆయన స్వయంగా మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలలో పచ్చదనం పెంపొందించడానికి ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.నాటిన ప్రతి ఒక్క మొక్కను కాపాడుకునేలా స్థానిక ప్రజలు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిరంతరం నీరు అందిస్తూ సంరక్షించాలని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ప్రాంగణంలో కనీసం రెండు మొక్కలైనా నాటాలని కోరారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి వృక్షోత్పత్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఎంఏ పిడి విజయ ప్రసాద్,పుట్టపర్తి తహసీల్దార్ సంహిత, ఏపీడీ, ఏపీఓ, హెచ్ఓ, డిప్యూటీ ఎంపీడీఓ, వీబీజీఆర్ఏఎంజీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బొద్దింక తెచ్చిన తంటా....

# కాంగ్రెస్‌కు ఊపిరి..!!

జిల్లా లో మళ్ళీ క్రియాశీలక రాజకీయాల్లోకి రఘువీరా.. ?

12 ఏళ్ల అనంతరం ఢీ కొంటున్న జాతీయ పార్టీలు.

బహిరంగంగా తలపడుతున్న బీజేపీ.,కాంగ్రెస్. కాక్రోచ్ జనతా పార్టీ తెచ్చిన తంటా.

కేంద్రప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు.





**( అనంతపురం డెస్క్ – సీమ వార్త ):**
నీట్ ప్రవేశపత్రాలు లీక్ కావడంతో 12 ఏళ్ల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ట పూర్తిగా మంటకలిసింది. సుమారు 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఏర్పడడం బాధాకరం. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆగ్రహజ్యోలలు తగిలాయి.ఈ మంటలు ఢిల్లీ ఎర్రకోటకు అటునుండి పార్లమెంటుకు, ప్రధాని అధికార నివాసానికి చేరుకున్నాయి. ఈ నిరసన ఒక్క డిల్లీకి పరిమితం కాకుండా దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు, అన్ని రాష్ట్రాల రాజధానిపై ప్రభావం చూపింది. కేంద్రాన్ని ఎలాగైనా దెబ్బకొట్టాలని, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం వాటిల్లే పరిణామాలు ఎదురుకావాలని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన కాంగ్రెస్ కి ఈ అవకాశం కలసి వచ్చింది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు కాంగ్రెస్ మద్దతుగా నిలిచింది. ఈ సందర్భంగా నేరుగా విద్యార్థులతో పాటు ఆందోళనల్లో పాల్గొన్న కాంగ్రెస్ - మిగతా3లో



## ప్లాస్టిక్ వాడకం.... మానవ ఆరోగ్యానికి విఘాతం..!!

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం....జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

హిందూపురంలో మల్టీ ప్రోడక్ట్ స్టోర్ ఏర్పాటు.








**హిందూపురం,జూలై,25:సీమ వార్త సాయంత్రం.** పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణే ధ్యేయంగా శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు హిందూపురం పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "హంస ఇకో షాప్ ను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు.హిందూపురంలోని డి.బి కాలనీ, మినీ మార్కెట్ ఆవరణలో ఆర్. సుజాత నిర్వహణలో 100% ప్లాస్టిక్ రహిత ఉత్పత్తులతో ఈ ప్రత్యేక మల్టీ-ప్రొడక్ట్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు మానవ ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతోందని ,"ప్లాస్టిక్ నిషేధిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.మహిళా సంఘాల సభ్యులు, స్వయం ఉపాధి ద్వారా పర్యావరణ అనుకూల వ్యాపార రంగానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఇకో షాపుల ద్వారా ప్లాస్టిక్‌కు అనుకూలమైన ప్రత్యామ్నాయ ఉత్పత్తులను ప్రజలకు తక్కువ ధరలోనే అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ మార్కెట్లకు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో గుడ్డ సంచులు, కాగితపు లేదా పర్యావరణ రహిత బయో-డీగ్రేడబుల్ సంచులను మాత్రమే ఉపయోగించాలని ప్రజలకు, వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.ఈ షాప్‌లో పూర్తిగా 100% ప్లాస్టిక్ రహితంగా తయారైన ఉత్పత్తులు లభిస్తాయి.కిరాణా బ్యాగులు,క్యారీ బ్యాగులు,చెత్త సేకరించే గార్బేజ్ బ్యాగులు,డి-కట్ బ్యాగులు,పౌచెస్ నాణ్యమైన గుడ్డ సంచులు.కాగితపు ప్లేట్లు,మట్టి కప్పులు.ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మెప్మా పిడి నాగరాజు,హిందూపురం తహశీల్దార్ వెంకటేశు,పురపాలక సంఘం అధికారులు, మెప్మా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# తొలగిన రైతు భ్రమలు!

ఆదిలోనే కొంపముంచిన ఖరీఫ్.. భారీగా పడిపోయిన పంటసాగు

ఉమ్మడి అనంత జిల్లా కరువును నిర్ధారించిన ప్రభుత్వం

సత్వర సహాయక చర్యలకు సన్నాహాలు





**( అనంతపురం డెస్క్ -- సీమ వార్త ): సాయంత్రం.**
దశాబ్దాల కరువు జిల్లా అయినా ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులు ఆశతో ఖరీఫ్ లో పంటసాగు కొనసాగించారు. ఎన్నడు ఊహించని విధంగా ఆదిలోనే అనంత, సత్యసాయి జిల్లాలలో వానలు వెక్కిరించగా రైతుల భ్రమలు తొలగిపోయాయి. భారీగా పంట సాగు తగ్గిపోయింది. ఇప్పటికే ఏర్పడ్డ వాతావరణ పరిస్థితులు, వర్షాభావం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి అనంత జిల్లాలు కరవు బారిన పడినట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది.ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితీ రాజశేఖర్ ఓ ప్రకటన చేస్తూ రాయలసీమ జిల్లాలు తీవ్ర దుర్భిక్షం లో చిక్కుకున్నాయి అని స్పష్టం చేశారు.ఈ జిల్లాలలో హై రిస్క్ ఉన్న ప్రాంతాలకు అవసరమైన సహాయక.చర్యలపై.నివేదిక సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు.కరువు తీవ్రత అధికంగా ఉన్న 1357 రైతు సేవా కేంద్రాల పరిధిలో విత్తనాలు, పశుగ్రాసం,లభ్యత ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంట సాగుకు అవసరమైన మినుములు, పెసర విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కొన్ని చోట్ల నిమ్మ, బత్తాయి తోటలు ఎండిపోతున్నాయి అని వాటిని కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా వేరుశనగ సాగు చరిత్రలో కనిష్టానికి చేరుకుంది.1.47 లక్షల హెక్టార్లకు గాను 15 వేల హెక్టార్లలో మాత్రమే సాగుచేసినట్లు అధికార గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఇంకా సమీప రోజుల్లో సాగు పెరిగినా అది 25 వేల హెక్టార్లకు మించిపోయే - మిగతా3లో

## రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి గా ఈ. జయరామ్



**అమరాపురం జులై 25 సీమవార్త సాయంత్రం** అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయితీ గుణేహళ్ళి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఈ జయరామ్ ను వైకాపా రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా వైకాపా అధినేత రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఈ జయరామ్ మాట్లాడుతూ తన నియమకానికి కృషిచేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిథున్ రెడ్డికి, వైకాపా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ కి, వైకాపా మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పకు మరియు మండల వైకాపా నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చేయడానికి ఎల్లవేళలా పార్టీ బలోపేతానికి మరింత కృషిచేస్తానని తెలిపారు.

## ప్రకాశం హైస్కూల్ లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్




**విద్యార్థుల భవిష్యత్తుపై చర్చ... పీటీమ్ లో మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష**

**తాడిపత్రి జులై 25 సీమ వార్త సాయంత్రం:** ఆంధ్ర రాష్ట్ర కూటమి ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా తాడిపత్రి 21వ వార్డు ప్రకాశం హైస్కూల్ నందు పీటీమ్ ఘనంగా నిర్వహించారు. స్థానిక 21వ వార్డు మాజీ కౌన్సిలర్ టి. హుస్సేన్ భాష ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని, ఉపాధ్యాయులు చెప్పే సూచనలను తప్పనిసరిగా పాటించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఆరోహణ రావు, కమిషనర్ శివరామకృష్ణ, హెచ్ యం సుధాకర్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఒక్కో విద్యార్థి పనితీరు గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల బలాలు, బలహీనతలు, హాజరు, ప్రవర్తన తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, విద్యా కానుక తదితర పథకాల గురించి కూడా ఈ సమావేశంలో అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ముగింపులో హెచ్ యం సుధాకర్ మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని, తరచుగా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

## సామాజిక సేవకు గుర్తింపు... ఎ .వి . సుధాకర్ కు "సేవా శిరోమణి" పురస్కారం

**ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రదానం**



**తాడిపత్రి జులై 25 సీమ వార్త సాయంత్రం:** తాడిపత్రి పట్టణంలోని శ్రీ వివేకానంద పాఠశాల నందు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బెంగళూరుకు చెందిన ఎ .వి . సుధాకర్ కి సేవా సంస్థ సభ్యుల సమక్షంలో "సేవా శిరోమణి" పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సేవా సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యాపార పరంగా వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే సమాజానికి విశిష్ట సేవలు అందించినందుకు గాను ఈ సేవా శిరోమణి పురస్కారాన్ని అందజేయడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. వేదికపై ఉన్న వక్తలు ఎ .వి . సుధాకర్ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. పురస్కార గ్రహీత ఎ .వి . సుధాకర్ మాట్లాడుతూ ఈ సత్కారం సమాజం పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని, మున్ముందు కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. సేవా సంస్థ సభ్యులు తనకు ఈ పురస్కారాన్ని అందజేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారు రంగయ్య, గౌరవాధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ గురప్ప, ఉపాధ్యక్షులు నారబోయిన శంకర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శంకర నారాయణస్వామి, మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కన్వీనర్ గోమతి, ట్రెజరర్ రామేశ్వర్ రెడ్డి, కార్యదర్శులు ఉమామహేశ్వరి, కుమారస్వామి, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు నివారించి - ప్రాణాలు కాపాడుకుందాం

**ప్రమాద రహిత వారోత్సవాల్లో డిఎం రమణయ్య**



**కదిరి జులై 25 సీమ వార్త సాయంత్రం.** మానవ తప్పిదాల ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించి ప్రాణాలను కాపాడాలని కదిరి ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య కోరారు. శనివారం కదిరి డిపో ఎం ఎఫ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రమాద రహిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిపో మేనేజర్ రమణయ్య మాట్లాడుతూ మానవ చిన్న చిన్న తప్పిదాలతో ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు పోతున్నాయని, వీటితో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు వీధిన పడుతున్నాయి అన్నారు. ఆర్టీసీ డ్రైవర్ సోదరులు అప్రమత్తంతో బస్సులు నడిపి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ప్రమాద రహిత వారోత్సవాలు నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయి అన్నారు. కార్యక్రమాల్లో డ్రైవర్ సోదరులు పాల్గొని అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రమణయ్య తో పాటు ఏఎస్ఐ రామలింగేశ్వర, ఎంఎఫ్ రామకృష్ణ, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నబి రసూల్, డిపో డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కెంపెగౌడ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన నాయకులు



**అమరాపురం జులై 25 సీమవార్త** సాయంత్రంఅమరాపురం మండల కేంద్రంలో హేమావతి కి వెళ్లే రోడ్డు ప్రక్కలో కెంపెగౌడ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలనను చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, హలుకూరు కాంతరాజు, విశ్వేశ్వర, నాగోనపల్లి మంజునాథ్, టైల్స్ నాగభూషణం,సప్లయర్ రఘు,మల్లికార్జున, నారాయణప్ప, జెకె మూర్తి, ఆటో తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్వరలో నాడ ప్రభు కెంపెగౌడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వారు పేర్కొన్నారు.

## స్లాట్ బుక్ చేసుకోండి. సులభతరంగా రిజిస్ట్రేషన్ వినియోగించుకోండి.




**ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ తాయన్న.**

**కార్యాలయాలకు నిబంధనలు జారీ చేసిన ఉన్నతాధికారులు.**

**ధర్మవరం జూలై 25 సాయంకాలం సీమ వార్త :** రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను మరింత సరళతరం చేయాలని ఉన్నతాధికారులు సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు ఆదేశించారని సబ్ రిజిస్టర్ తాయన్న తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దస్తావేజు విలేఖరులు పెన్డౌన్ నిరసనతో ప్రభుత్వ సేవలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ, ప్రభుత్వ రాబడికి ఎలాంటి గండి పడకుండా సేవలు అందించాలని సూచించారు. ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని ప్రజలు ఆన్‌లైన్ స్లాట్ రిజిస్ట్రేషన్ల సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ఎలాంటి అవరోదాలు నేరుగా సబ్ రిజిస్టర్ ను కలవాలని, అధికారులు సూచించారు. సమయం ఆదావడం తో పాటు దళారుల ప్రమేయం లేకుండా వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు .

## పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

**విశాఖపట్టణం :** సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు.లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## 85 జూలై 24న జరగాల్సిన ఓయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో 'ఛలో పార్లమెంటు మార్చ్' నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

## తొలగిన రైతు భ్రమలు..!!

-మొదటిపేజీ తరువాయి

అవకాశాలు కనిపించడం లేదు. ఈ వంతున 1960 తరువాత సాగుపడిపోవడం ఇది మొదటిసారి అని రికార్డులు తెలియచేస్తున్నాయి. నానాటికి వేరుశనగ పంట ద్వారా జరిగే నష్టాలను చూసి విసుగెత్తి పోయిన రైతులు ఈ పంట స్థానంలో కంది, మొక్కజొన్న, ఆముదం పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇంకా వర్షాలు కురిసే అవకాశాలుగానీ, సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు కానీ ఎక్కడా కనిపించడం లేదు. ఏ కోశానా రైతుకు భరోసా కనిపించడం లేదు. వ్యవసాయానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం కూడా అంతంత మాత్రమే కావడంతో ఈ ఏడాది కరువు రికార్డులలో నిలిచిపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రకృతి , ప్రభుత్వం కూడా రైతులను అనుగ్రహించడం లేదు.ఒక రకంగా చెప్పాలంటే ప్రకృతి ఆగ్రహించిందని చెప్పవచ్చు. పరిస్థితులు చూస్తుంటే సమీప భవిష్యత్ లో గ్రామీణ ప్రజలు కుటుంబాలతో సహా భారీగా ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే అవకాశాలు మెండుగా ఉన్నాయి.ఇక పశుగ్రాసం లేక పశుపోషణ భారంగా మారి రైతులు తమ పశువులను కబేళాకి తరలించడం ఇప్పటికే ప్రారంభం అయింది. ఏది ఏమన్నా ప్రజాజీవనం ప్రమాదపు అంచున ఉంది. ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టని పక్షంలో జనజీవనం అస్తవ్యస్థంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

## బొద్ధింక తెచ్చిన తంటా.... కాంగ్రెస్‌కు ఊపిరి..!!

-మొదటిపేజీ తరువాయి

యువరాజు రాహుల్ ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ శ్రేణుల్లో దశాబ్దం తరువాత చలనం వచ్చింది. దేశవ్యాప్తంగా బిజెపి. కార్యాలయాల వద్ద ధర్నాలు చేయడం, కేంద్ర నాయకుల తీరును ఘాటుగా విమర్శించడం లాంటి చర్యలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం అయ్యాయి.అదే సందర్భంలో కాంగ్రెస్ పై ప్రతిదాడికి బిజెపి శ్రేణులు సమాయత్తం అయ్యాయి. అన్ని చోట్ల ఉభయ జాతీయ పార్టీలు ఢీ అంటే ఢీ అని ఆందోళనలకు దిగాయి. ఇందులో భాగంగా చాలా కాలంగా క్రియాశీల రాజకీయాలకి దూరంగా ఉన్న మాజీ మంత్రి, డబ్ల్యూ సి సి. సభ్యులు రఘువీరారెడ్డి ఈ ఆందోళనలతో బాహ్య ప్రపంచంలోకి చొరబడ్డారు.తన నియోజకవర్గ కేంద్రమైన మడకశిరలో కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ పార్టీ శ్రేణులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు.ఈ సందర్భంగా కేంద్రానికి విద్యాభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని ఘాటుగా ప్రకటించారు.దేశవ్యాప్తంగా 91 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడడం కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని మండి పడ్డారు.అదే విధంగా యువత భవిష్యత్ ను బేఖాతరు చేసి కేంద్రం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడంతో దేశంలో 21 కోట్ల మంది నిరుద్యోగులు ఉపాధి లేక విలవిల్లాడి పోతున్నారని ఇంత నీచమైన ప్రభుత్వం చరిత్రలో లేదన్నారు. కాగా సరిగ్గా స్థానిక ఎన్నికల సమరం ప్రారంభంలో రఘువీరా రెడ్డి ఆందోళనల పేరుతో సమరశంఖం పూరించడం కొందరికి భయం కలిగించే అంశం. కాంగ్రెస్ పార్టీ పునాదులు కదిలిపోయినా కార్యకర్తలు కనుమరుగై పోయినా పార్టీ శ్రేణి మొత్తం వైకాపాలో కలసిపోయినా రఘువీరారెడ్డి చరిష్మా ఒక్కటే వైకాపా కి దెబ్బగా కనిపిస్తోంది..ఇదేమైనా రాష్ట్రవ్యాప్తంగా ఎలా ఉన్నా శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో స్థానిక ఎన్నికల్లో రఘువీరుని ప్రభావం బాగానే ఉంటుందని చెప్పవచ్చు. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఈ స్థానిక ఎన్నికల పోరుకు కాంగ్రెస్ అధిష్టానం పచ్చజెండా ఊపుతుందా... వచ్చే సాధారణ ఎన్నికల వరకు పార్టీని బలోపేతం చేసేపని లో నిమగ్నం అవుతుందా అనేది చర్చనీయాంశంగా మారింది. ఎక్కడో ఢిల్లీ లో ఆందోళనలు జరిగితే దేశవ్యాప్తంగా ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థి లోకంలో చలనం రావడం ఆశ్చర్యం కలిగించే విషయం. పరిస్థితులు చూస్తుంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో బిజెపి పార్టీ అధికారంలోకి రాకుండా యువత, విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంతలోగా కాంగ్రెస్ పార్టీల్లో ఉద్ధండులుగా పేరుమోసిన రఘువీరారెడ్డి లాంటి వారు పూర్తిగా జీవం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి జీవం పోసే చర్యలకు నడుం బిగించే అవకాశాలు ఉన్నాయి.

## జంతర్ మంతర్‌లో అంటువ్యాధుల ముప్పు

దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన ఘర్షణల్లో పాల్గొన్న వారిని గుర్తించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఆ హింసాకాండ ముందస్తు ప్రణాళికతో జరిగిందా లేక ఆకస్మికంగా చెలరేగిందా అని నిర్ధారించడానికి దిల్లీ పోలీసులు వేలాది వీడియోలు, సోషల్ మీడియా ప్రసారాలు, మొబైల్ ఫోన్ రికార్డులను పరిశీలిస్తున్నారని శుక్రవారం వర్గాలు తెలిపాయి. పోలీసు సిబ్బందిపై దాడి చేస్తూ, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిని గుర్తించడానికి మొబైల్ ఫోన్ రికార్డింగ్‌లు, సీసీటీవీ ఫుటేజ్, లైవ్‌స్ట్రీమ్‌లు, సోషల్ మీడియా కంటెంట్‌ను విశ్లేషిస్తున్నారని వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, నిరసనల సమయంలో సోషల్ మీడియాలో లైవ్‌లోకి వెళ్లిన వ్యక్తులను కూడా దర్యాప్తు అధికారులు గుర్తిస్తున్నారని ఓ అధికారి తెలిపారు. ఆ ప్రసారాల ద్వారా హింసలో పాల్గొన్న వ్యక్తుల ఉనికిని కనిపెట్టవచ్చని భావిస్తున్నారు. పోలీసు బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించే ముందు నిరసనకారులు సమన్వయం చేసుకున్నారా లేదా అని నిర్ధారించడానికి, దర్యాప్తు అధికారులు పలువురు అనుమానితుల కాల్ రికార్డ్స్, మొబైల్ టవర్ లొకేషన్లు, కమ్యూనికేషన్ విశ్లేషిస్తున్నారు. ఘర్షణలకు ముందు, తర్వాత సమయంలో అనుమానితుల కదలికలను పోలీసులు గుర్తించనున్నారు. హింసాకాండ జరిగిన సమయంలో పలు ప్రదేశాల్లో ఉన్న మొబైల్ నంబర్లను గుర్తించడానికి, పార్లమెంట్ స్ట్రీట్, జంతర్ మంతర్ దాని పరిసర ప్రాంతాల నుంచి టవర్ డంప్ విశ్లేషణ కూడా జరుగుతున్నట్లు వర్గాలు తెలిపాయి.

### స్పెషల్ క్రైమ్ బ్రాంచ్?

ఇక, జులై 20న జరిగిన ఘర్షణలపై దర్యాప్తు చేసేందుకు దిల్లీ పోలీసులు స్పెషల్ సెల్?, క్రైమ్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ నిరసనల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 480కి పైగా పాకిస్థాన్ ఆధారిత సోషల్ మీడియా ఖాతాలను గుర్తించినట్లు నగర పోలీసులు గురువారం ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా అవే ఖాతాలు యాక్టివ్?గా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులను రెచ్చగొట్టే ఉద్దేశంతో వదంతులు, తప్పుడు పోస్ట్‌లు, ఎడిట్ చేసిన వీడియోలు ప్రస్తుత పరిస్థితులను దుర్వినియోగం చేస్తున్నాయని ఒక పోలీసు అధికారి పేర్కొన్నారు.

### రంగంలోకి అదనపు బలగాలు

నీట్ పేపర్ లీకేజీపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. విద్యార్థుల నిరసన దృష్ట్యా భద్రతను పెంచేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి 10 సీఆర్‌పీఎఫ్ కంపెనీల బలగాలను రంగంలోకి దించనుంది. వీళ్లని దిల్లీకి రప్పించేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. భద్రత పెంచేందుకు ఈ వారంలో బంగాల్ నుంచి 20 సీఆర్‌పీఎఫ్ కంపెనీల బలగాలను కేంద్రం రప్పించింది.

### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పటిష్ఠ బందోబస్తు

అటు సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దిల్లీ విధుల్లో చేరే సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ కూడా ముందుగానే దిల్లీకి చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. రానున్న కొన్ని రోజుల్లో సుమారు 150 సీఏపీఎఫ్? కంపెనీలను దిల్లీలో మోహరించనున్నారు. ఇప్పటికే పోలీసులకు శాంతిభద్రతల విధుల్లో సహాయం చేసేందుకు సుమారు 100 సీఏపీఎఫ్? కంపెనీలు దిల్లీలో అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటుగా మూడు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ యూనిట్లు, ఇతర సాయుధ బలగాలను కూడా రంగంలోకి దించారు. మరోవైపు, భద్రతా కారణాల దృష్ట్యా దిల్లీ మెట్రో భద్రతా సిబ్బంది సెలవులను అధికారులు రద్దు చేశారు.

### నిరసన ప్రదేశంలో అంటువ్యాధుల ముప్పు

ఇదిలా ఉండగా, జంతర్ మంతర్ నిరసన ప్రదేశంలో అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని, చాలా మంది నిరసనకారులు తలనొప్పి, గొంతు నొప్పితో బాధపడుతున్నట్లు స్థానిక వైద్యులు తెలిపారు. తీవ్రమైన ఎండ, అధిక తేమ, భారీ జనసమూహం వల్ల చాలా మంది వైరల్ ఇన్ఫెక్షన్లు, డీహైడ్రేషన్, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. చాలా మంది బహిరంగ ప్రదేశాల్లో నేలపైనే నిద్రిస్తున్నారని, దీనివల్ల ఇన్ఫెక్షన్ ముప్పు పెరుగుతోందని తెలిపారు.

సీమ వార్త సాయంకాలం
శనివారం 25 జూలై 2026

## మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



**టి సుండుపల్లె, జూలై 25 సీమ వార్త సాయంత్రం** జీకే రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శివారెడ్డి( మంత్రి) కుమార్తె డాక్టర్ లేఖితారెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన కళ్యాణికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన సీమ షబానంకు రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన ప్రణతికి రూ.2 వేలు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహబూబ్ జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురి తప్పని వీరుడు ఏకలవ్య డు.





.....గోరంట్ల లో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు

....ఏకలవ్య జయంతి నీ అధికారికంగా నిర్వహించాలి

**గోరంట్ల, జూలై 25 సీమ వార్త సాయంత్రం.** ఏకలవ్య మహారాజ్ జయంతి ఉత్సవము శనివారం గోరంట్ల పట్టణం లోని ఎస్ సి హాస్టల్ ఎదుట ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు , ఈ సందర్భంగా కూటమి నాయకులతో కలిసి ఎరుకల సంఘాల నాయకులతో కులస్తులు ఏకలవ్యుని చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అలాగే కేక్ కటింగ్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏకలవ్య జయంతి నీ అధికారికంగా నిర్వహించాలని కులస్తులు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమా శంకర్ జిల్లా అధ్యక్షుడు పి. వేంకటాచలపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ రాష్ట్ర కార్యదర్శి సాకె నాగమణి, గోరంట్ల పట్టణ అధ్యక్షుడు నరసింహప్ప, టౌన్ వైస్ ప్రెసిడెంట్ కుళ్ళయప్ప, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు రమణప్ప, రాష్ట్ర నాయకులు సాకె వెంకరముడు టీడీపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ చౌదరి, హస్తకళా కార స్టేట్ డైరక్టర్ సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి నరేష్ ,సిక్స్ మెన్ కమిటీ జయరాం, వేణు, గిరిధర్ గౌడ్ ,నాగేనాయక్, నిమ్మల శ్రీధర్ , జనసేన సురేష్ , బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనా రాయణ, బొట్టు శ్రీనివాసులు , మాజీ వార్డు సభ్యులు అగిసం నాగరాజు ,సోమగట్ట నాగభూషణ, లక్ష్మీనరసింహుడు, గంగాధర్, మాజీ సింగాల్విండో ప్రెసిడెంట్ ఉత్తమ రెడ్డి , ఆనంద్ బాబు, శ్రీనివాసులు, అశ్వత్తప్ప, నాగరాజు, నాగన్న, మునీస్వామి, రమేష్ సురేంద్ర గంగాధర్ మూర్తి తదితరులు జై ఏకలవ్య జై జై ఏకలవ్య నినాదాలతో కార్యక్రమం నిర్వహించారు,

## మొక్కలు నాటండి... పర్యావరణాన్ని కాపాడండి.




......-మొక్కలు నాటిన హరీష్ స్కూల్ విద్యార్థులు

..... పాల్గొన్న జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి.

**కదిరి జులై 25 సీమ వార్త సాయంత్రం.** బట్రేపల్లి సమీపంలోని నగరవనంలో శనివారం అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. జపాన్ దేశంలో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారని, అదే పద్ధతిలోనే తాము కూడా మొక్కలు నాటామన్నారు. మొక్కలు నాటడంవల్ల అవి పెరిగి స్వచ్ఛమైన గాలిని అందిస్తాయన్నారు. చల్లటి వాతావరణంతో పాటు సకాలంలో వర్షాలు కురుస్తాయని చెప్పారు. హరీష్ స్కూల్ విద్యార్థులతో కలిసి నగరవనంలో మొత్తం 4 వేల మొక్కలు నాటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రిన్సిపాల్ ఎం.ఎస్. కిరణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు గుర్రప్ప, శ్రీనివాసులు, అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఫారూఖ్, ప్రసన్న కుమార్, రవి శంకర్, లక్ష్మీ పవిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించిన అధికారులు



**సోమందేపల్లి జూలై 25 సీమ వార్త** సాయంకాలం మండల కేంద్రంలోని కదిరేపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మారుతి ప్రసాద్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఎస్సై సుధాకర్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు రామకృష్ణ శరత్ చంద్రారెడ్డి సంజీవరెడ్డి అధికారులకు దగ్గరుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అధికారులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## అమరాపురంలో జగనన్న 2.0 సూపర్ యాప్ ఆవిష్కరణ



**అమరాపురం జూలై 25 సీమ వార్త సాయంత్రం** మండల కేంద్రమైన అమరాపురంలోని వైయస్సార్ విగ్రహం వద్ద రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ మరియు రాయలసీమ జలాశయాల సాధన కమిటీ శ్రీ సత్య సాయి జిల్లా కో ఆర్డినేటర్, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు హలుకూరు కాంతరాజు, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్పల ఆధ్వర్యంలో జగనన్న 2.0 డిజిటల్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో ఈరలక్కప్ప, హలుకూరు కాంతరాజు లు మాట్లాడుతూ డిజిటల్ యాప్ ను వైకాపా నాయకులు కార్యకర్తలు డౌన్లోడ్ చేసుకుని స్థానికంగా వైకాపా నాయకులు కార్యకర్తలు అధికార పార్టీ నాయకుల ద్వారా ఇబ్బందులు పడుతుంటే ఈ యాప్ లో నమోదు చేస్తే జగన్ దృష్టికి మీ సమస్య వెళుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. దీనిపై గ్రామస్థాయిలో కూడా వైకాపశ్రేణులకు వివరించాలని వారు కోరారు. మడకశిర నియోజకవర్గంలో అధికార పార్టీని ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తే టిడిపి శ్రేణులు నోటికి వచ్చినట్లు మాట్లాడతారని ఇక్కడ ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులు ,ప్రజలకు చేస్తున్న ఇబ్బందులను ఈ యాప్ ద్వారా పార్టీ అధినేత దృష్టి కి చేరవేసే కార్యక్రమం అని వారు తెలిపారు. ఈ సందర్భంగా వైకాపా రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి ఎంపిపి ఈరన్న, వైకాపా కన్వీనర్ త్రిలోక్నాథ్, జిల్లా వైకాపా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు హనుమంతరాయ, నారాయణగౌడ్,కెంచప్ప, నియోజకవర్గ ఉపాధ్యాయ వైకాపా అధ్యక్షుడు ఆలదపల్లి కృష్ణమూర్తి,మండల బీసీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మండల యువజన అధ్యక్షుడు మల్లికార్జున, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్, బూత్ మేనేజర్ రామ్మూర్తి, అమరాపురం సిద్దేశ్వర గౌడ్ ,సీనియర్ నాయకులు ప్రసాద్, ఆటో తిప్పయ్య, జీకే మూర్తి, డీలర్లు శివలింగప్ప, శివకుమార్, మాజీ సర్పంచులు హితేంద్ర ,గోవిందప్ప, సదానందగౌడ్, నరసింహమూర్తి,యోగి, ఉదుగూరు రామన్న భరతరాజు, ఎంపిటిసి మంజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నీటిశుద్ధి ప్లాంటు ముంజూరు మడకశిర




**జూలై 25 సీమ వార్త** నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, మరియు అగళి కేజీబీవీ పాఠశాలలకు సెంట్రల్ బ్యాంకు సౌజన్యంతో విద్యార్థుల దహార్తిని తీర్చడానికి, ఆర్వో ప్లాంట్ ముంజురైనట్లు సెంట్రల్ బ్యాంకు అనంతపురం శాఖ సీనియర్ మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. శనివారం నాడు ఆయన మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నంతపాఠశాల, మరియు అగళి, కేజీబీవీ యందు ఒక్కొక్క ప్లాంటు రూ 170000 తో ఏర్పాటుచేసిన ప్లాంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు రవికృష్ణ, ఉపాధ్యాయులు మహాదేవప్ప, యంజారప్ప,శ్రీనివాసులు సీర్ పీ గిరిరాజు, అగళి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, నాగరత్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 26న టిడిపి డి2డి కార్యక్రమం గురించి సమావేశం



**అమరాపురం జూలై 25 సీమ వార్త సాయంత్రం** అమరాపురం తెలుగుదేశం నాయకులకు కార్యకర్తలకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాలమేరకు అమరాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 26న ఆదివారం డి టు డి ప్రోగ్రాం (డోర్ టు డోర్ ఇంటింటికి తెలుగుదేశం) గురించి తెలియజేయడానికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజులు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని కావున మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వివిధ హోదాలో ఉన్న నాయకులుక్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, పంచాయతీ కన్వీనర్లు, కోక్లస్టర్లు, యూనిట్ ఇన్చార్జులు బూత్ కన్వీనర్లు అనుబంధ సంఘాల నాయకులు చెరువు సంఘం అధ్యక్షులు డీలర్లు ఫీల్డ్ అసిస్టెంట్ లు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ విధిగా హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు

## గోరంట్లలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన.



మంత్రి సవిత అదేశాలతో... అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు.

పాల్గొన్న మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్,

జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి నరేష్.

**గోరంట్ల జులై 25 సీమ వార్త సాయంత్రం.** పేద ప్రజలకు ఐదు రూపాయలకే అన్నం పెట్టాలన్న ప్రభుత్వ ఉద్దేశంతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ఆదేశాలతో గోరంట్ల పట్టణంలోని బస్టాండ్ వద్ద త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో శనివారం మండల టిడిపి నాయకులు స్థల పరిశీలన చేపట్టారు. మండల టిడిపి కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, సింగిల్ విండో అధ్యక్షులు బిల్లాల చెరువు చంద్ర,బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి సురేష్ తదితరుల నేతృతంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ బస్టాండ్ వద్ద గల ఆర్ అండ్ బి బంగ్లా ప్రహరీలో ప్రధాన రోడ్డుకు ముఖద్వారంగా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు స్థానిక పేద ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ నిర్ణయాన్ని మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకెళ్లి చర్చించి త్వరలోనే గోరంట్ల బస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని కన్వీనర్ బాలకృష్ణ చౌదరి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉత్తమ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ నాగరాజు, నాగే నాయక్, గిరిధర్ గౌడ్, కురుమాల జయరాం, పసుపులేటి శ్రీనివాసులు, వెంకటాచలం, సుభహన్, రోహిత్, ప్రతాప్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.
బిజెపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు,

## నీలకంఠాపురంలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు,



శ్రీ రంగనాథ స్వామికి విశేష పూజలు, విష్ణు సహస్రనామ హోమం

**మడకశిర జూలై 25 సీమ వార్త** సాయంత్రం మండల పరిధి లోని నీలకంఠాపురం దేవస్థానములు లో శనివారం శ్రీ రంగనాథ స్వామి తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ స్వామివారి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు, హోమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.?ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి వేదమంత్రోచ్చారణల నడుమ విశేష పంచామృత అభిషేకం నిర్వహించి, దివ్యాలంకరణ చేశారు. అనంతరం లోకకల్యాణార్థం అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష విష్ణు సహస్రనామ హోమాన్ని జరిపారు.?భక్తుల జయజయధ్వానాల నడుమ శ్రీ రంగనాథ స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ మాడవీధుల్లో కన్నులపండువగా ప్రాకారోత్సవం (ఊరేగింపు) నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం మహా మంగళారతి నివేదించి, విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.
?ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్
రఘువీర రెడ్డి ..దేవస్థాన నిర్వహణ వర్గం, గ్రామ పెద్దలు మరియు విశేష సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## తొలి ఏకాదశి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న బొంబాయి రమేష్ నాయుడు



**యాడికి జులై 25 సీమ వార్త సాయంకాలం** యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ బొంబాయి రమేష్ నాయుడు మాజీ ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ మరియు బొంబాయి రమేష్ నాయుడు గారి కుమారులు, ఉపేంద్ర నాయుడు, కృష్ణ కళ్యాణ్ బాబు తదితరులు

## అర్హులకు అందని తల్లికి వందనం



**మడకశిర జులై 25 సీమ వార్త సాయంత్రం** మండల పరిధి లోని వై.బి.హళ్ళి గ్రామానికి చెందిన వి చంద్రశేఖర్ కు ముగ్గురు పిల్లలు. వారు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతసంవత్సరం కూడా ఈ పిల్లలకు తల్లకి వందనం అందలేదు.కారణం చంద్రశేఖర్ హౌస్ హోల్డింగ్స్ మాపింగ్ నందు అతని తమ్ముడు ప్రభుత్వ ఉద్యోగిని మ్యాపింగ్ చేయడమే తమ్ముడు ఉద్యోగి అయితే అన్న పిల్లలకు అనర్హులుగా ప్రకటించడం బాదితుడు ఏం చేయాలో తోచక లబోదిబోమంటున్నారు.సంబందిత అధికారులు స్పందించి అర్హులైన నా పిల్లలకు తల్లికి వందనం అందేలా చూడాలని వేడుకుంటున్నాడు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881